క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక



రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన గురుకులం విద్యార్థులు

అల్లవరం: రామచంద్రాపురంలో ఇటీవల జరిగిన జిల్లా స్థాయి అండర్–19 విభాగంలో గోడి బాలురు గురుకులానికి చెందిన క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. సాఫ్ట్ బాల్ విభాగంలో ఎం.అభిరామ్, బేస్‌బాల్ విభాగంలో సంతోష్‌కుమార్, ఉదయ్‌లు ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పాఠశాల సిబ్బంది అభినందించారు.

ఇసుక లారీలను అడ్డుకున్న లారీ యాజమానులు

అమలాపురం రూరల్: మండలంలోని సమనస, చిందాడగరువు గ్రామాల్లో నిర్మిస్తున్న ప్రభుత్వ మెడికల్ కళాశాల నుంచి రాజమండ్రి మెడికల్ కళాశాలకు ఇసుకను తరలిస్తున్న లారీలను మంగళవారం స్థానిక లారీ యాజమానులు అడ్డుకున్నారు. అనంతరం మెడికల్ కళాశాల వద్దకు వెళ్లి ఇసుక తరలిస్తున్నవారిలో వాదనకు దిగారు. స్థానిక లారీలను వినియోగించుకోకుండా వేరే ప్రాంతానికి చెందిన లారీలను ఇక్కడ నుంచి ఇసుక తరలింపునకు వినియోగిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పైగా రాజమండ్రి అని చెప్పి కాకినాడ వైపునకు ఇసుక లారీలను తీసుకెళ్లడమేంటని ప్రశ్నించారు. దీంతో లారీలన్నీ మార్గం మధ్యలోనే నిలిచిపోవడంతో ఇసుక తరలింపు ఆగిపోయింది.

ఉపాధి పనులపై గ్రామ సభ



ఉపాధి పనుల వివరాలను గ్రామసభలో వివరిస్తున్న డీఆర్‌పీ శ్యామ్

అల్లవరం: మొగళ్లమూరు పంచాయతీ పరిధిలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులకు గత నాలుగు రోజులుగా సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నారు. సర్పంచ్ రాయుడు విష్ణు అధ్యక్షతన మంగళవారం సచివాలయం వద్ద గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌పీ శ్యామ్ ఉపాధి పనులను వివరించారు. రూ.60 లక్షలతో 62 పనులు చేశారని తెలిపారు. పంచాయతీలో కేవలం ఇద్దరికి మాత్రమే వంద రోజుల పని కల్పించారన్నారు. అయితే గతేడాదికి చెందిన 48 వర్కు ఫైల్స్ ఆడిట్ సిబ్బందికి ఫీల్డ్ అసిస్టెంట్ అందించలేదని తెలిపారు. ఈ నెల 28న అల్లవరం మండల పరిషత్ కార్యాలయం వద్ద సామాజిక తనిఖీ ప్రజా వేదిక ఉంటుందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి కనకమ్మ, లూటుకుర్తి చిన్నా, మేట్లు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

అంతర పంటల సాగుకు ప్రాధాన్యమివ్వాలి



రైతులకు కూరగాయల కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే అశోక్

యానాం: రైతులు అంతర పంటల సాగుకు అధిక ప్రాధాన్యమివ్వాలని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పేర్కొన్నారు. మంగళవారం వ్యవసాయంలో వెజిటబుల్, ఇంటిగ్రేటెడ్ హార్టికల్చర్ అభివృద్ధి పథకం ద్వారా కాయగూరల కిట్లను రైతులకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వపరంగా రావాల్సిన పథకాల అమలుకు కృషి చేస్తానన్నారు. అదేవిధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సబ్సిడీ ద్వారా వ్యవసాయ పనులకు సంబంధించి యంత్రాలను అందించేలా చూస్తానన్నారు. ఇటీవలి సబ్సిడీపై ట్రాక్టర్ల కొనుగోలుకు సంబంధించిన మొత్తం రూ.2 కోట్ల నిధులు వెనక్కి మళ్లాయని ఆవేదన వ్యక్తం చేశారు. సేంద్రియ ఎరువులకు ప్రాధాన్యతమిచ్చి వ్యవసాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ డీడీ శివసుబ్రహ్మణ్యం, వ్యవసాయాధికారి జోగిరాజు, ఫీల్డ్‌మ్యాన్ ఖాన్, డీఎం విజయ్‌కుమార్, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

తాళ్లరేవులో సాయిభక్తుల పాదయాత్ర

తాళ్లరేవు: కాకినాడ రూరల్ మండలం రేపూరు గ్రామంలో ప్రసిద్ధిగాంచిన విరాట్ సాయి ఆలయానికి సాయిభక్తులు పాదయాత్రగా వెళుతున్నారు. ముమ్మిడివరం మండలం చెయ్యేరు గున్నేపల్లి గ్రామానికి చెందిన సాయిభక్తులు అక్కడి నుంచి రేపూరుకు పాదయాత్రగా వెళుతూ తాళ్లరేవులో విలేకర్లతో మాట్లాడారు. ఈ నెల 28వ తేదీన శ్రీ షిరిడి సాయి సేవాశ్రమం ట్రస్టు ప్రతినిధి, పూజ్య గురువులు అమ్ముల సాంబశివరావు పుట్టినరోజు సందర్భంగా ఈ పాదయాత్ర చేపట్టినట్లు భక్తులు తెలిపారు. మూడు రోజులపాటు సుమారు 63 కిలోమీటర్లు పాదయాత్ర చేయనున్నట్లు వారు తెలిపారు.

మలుపు కాదది.. మృత్యు పిలుపు

- ప్రమాదకరంగా కొత్తకాలువ సెంటర్
- రోడ్డు దాటాలంటేనే భయపడుతున్న ప్రజలు



కొత్తకాలువ సెంటర్‌లో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ప్రమాదకర మలుపు

ముమ్మిడివరం: మండలంలోని నాలుగు గ్రామాల కూడలిగా ఉన్న కొత్తకాలువ సెంటర్ ప్రమాదకరంగా మారింది. ఇక్కడ 216 జాతీయ రహదారికి ఆనుకుని ప్రమాదకర మలుపు ఉండటంతో పాటు గాడిలంక గ్రామానికి వెళ్లే జెడ్పీ రహదారి, అన్నంపల్లి గ్రామానికి వెళ్లే రహదారి, మర్లపాలెం, చినకొత్తలంక గ్రామానికి వెళ్లే కెనాల్ రోడ్డు ఉన్నాయి. జాతీయ రహదారిపై భారీ వాహనాలు దూసుకుపోతుండడంతో సరిగ్గా ఇదే కూడలి వద్ద పదే పదే ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో ఈ ప్రాంతంలో జాతీయ రహదారిని దాటడం అంటే వాహన చోదకులు, పాదచారులు హడలిపోతున్నారు.

కానరాని హెచ్చరిక బోర్డులు

మండల కేంద్రమైన ముమ్మిడివరం వెళ్లాలంటే గాడిలంక, మర్లపాలెం, చినకొత్తలంక, అన్నంపల్లి, కొమానపల్లి గ్రామాలకు చెందిన ప్రజలు ఈ ప్రాంతానికి చేరుకుంటారు. ఇక్కడ బస్‌స్టాప్ కూడా ఉండటం వల్ల తరచూ రోడ్డుపై వాహనాలు ఆగి ప్రయాణికులను తీసుకెళుతుంటాయి. దీంతో నిత్యం ఇదే కూడలి మీదుగా వందలాది వాహనదారులు జాతీయ రహదారిని దాటుతుంటారు. ప్రమాదకర మలుపు ఉండటంతో రహదారిపై వచ్చే వాహనాలను గుర్తించే పరిస్థితి లేక రోడ్డు దాటే సమయంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. పైగా జాతీయ రహదారిపై వెళ్లే భారీ వాహనాల వేగాన్ని అదుపు చేసేందుకు సూచిక బోర్డులు సైతం లేవు. ఈ కూడలిలో రెండు వైపుల హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాల్సి ఉన్నా పట్టించుకునే నాథుడు కరవయ్యాడు. హైవే అధికారులు జీబ్రా లైన్లు, పరిమిత వేగంతో ప్రయాణించాలని తెలియజేసే హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాల్సి ఉంది. ముఖ్యంగా రాత్రి వేళ చీకటిగా ఉండటంతో రోడ్డును దాటడం మరింత ప్రమాదకరంగా మారుతుంది. నాలుగు గ్రామాలకు చెందిన సుమారు 5,000 మంది జనాభా నిత్యం ఈ రోడ్డును దాటి ప్రయాణిస్తుంటారు. ఈ కూడలిలో రాత్రి సమయాల్లో వాహన చోదకులకు కనిపించేలా జాతీయ రహదారిపై సెంట్రల్ లైటింగ్ లేదా హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ కూడలిపై హైవే అధికారులు ప్రత్యేక దృష్టిసారించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నిత్యాన్నదానానికి విరాళం



దాత కుటుంబ సభ్యులను అభినందిస్తున్న ఆలయ అధికారులు

ఐ.పోలవరం: మురమళ్ల వీరేశ్వర స్వామివారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు కాకినాడ గ్రామానికి చెందిన ముత్యాల రాంబాబు కుటుంబ సభ్యులు రూ.10,116 విరాళంగా ఇచ్చారు. ఈ మొత్తాన్ని ఆలయ పర్యవేక్షణధికారి బి.వీరభద్రరావుకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా దాత కుటుంబ సభ్యులను కార్యనిర్వాహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ అభినందించారు. తొలుత వీరికి ఆలయ అర్చకులు బ్రహ్మశ్రీ పేటేటి శ్యామలకుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక దర్శనం అందించారు. స్వామి వారి శేషవస్త్రం, చిత్రపటం, ప్రసాదం అందించి సత్కరించారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్య సమాజం



స్వచ్ఛతాహి కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

యానాం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని, దానికి అందరూ సహకరించాల్సిన ఆవశ్యకత ఉందని పలువురు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శివాలయం పరిసర ప్రాంతాల్లో చెత్తను, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. కార్యక్రమంలో డాక్టర్ వి.భాస్కర్, ప్రోగ్రామ్ ఆఫీసర్లు ఎస్.శ్రీనివాస్, సి.నరేష్, రీజినల్ కోఆర్డినేటర్ కృష్ణసుధాకర్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.



సముద్ర జలాల్లో చెత్తను సేకరిస్తున్న అటవీ సిబ్బంది

సముద్ర జలాల్లో ప్లాస్టిక్ చెత్త సేకరణ

తాళ్లరేవు: సముద్ర జలాల్లో మత్స్య సంపదకు, వన్యప్రాణులకు ప్రాణాంతకంగా ఉండే ప్లాస్టిక్ చెత్తను అటవీ శాఖ సిబ్బంది సేకరించారు. మంగళవారం అటవీశాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా కోరంగి ఫారెస్ట్ రేంజర్ ఎస్ఎస్ఆర్ వరప్రసాద్ పర్యవేక్షణలో కోరంగి సీమౌత్ నుంచి కాకినాడ లంగర్ రేవు వరకూ ఉన్న చెత్తను సేకరించారు. కార్యక్రమంలో జీసీఎఫ్ జిల్లా కోఆర్డినేటర్ శ్రీహర్ష, నాక్సా సీఈఓ డైహన్ కంగ్లం, ఎఫ్ఎస్ఓ ఎస్.వీరభద్రరావు, ఎఫ్‌బీఓలు జి.గోపి, నాగేంద్రకుమార్, కె.మహేష్, కె.ధనుంజయ, సుభాని, సీహెచ్ ధనలక్ష్మి, మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్షుడిగా చిట్టిబాబు ప్రమాణ స్వీకారం

అమలాపురం టౌన్: ఇటీవల జిల్లా కాంగ్రెస్ కమిటీ(డీసీసీ) అధ్యక్షుడిగా నియమితులైన మాజీ ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అమలాపురంలో మంగళవారం సాయంత్రం ప్రమాణ స్వీకారం చేశారు. స్థానిక ముస్లిం షాదీఖానా భవనంలో జరిగిన ఈ కార్యక్రమానికి డీసీసీ మాజీ అధ్యక్షుడు కామన ప్రభాకరావు అధ్యక్షత వహించి చిట్టిబాబుతో ప్రమాణ స్వీకారం చేయించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీడబ్ల్యూసీ ప్రతినిధి గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ కార్యకర్తలంతా పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. అనంతరం చిట్టిబాబును సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ ఇన్‌చార్జి జగతా శ్రీనివాస్, జంగా గౌతమ్, కొత్తూరి శ్రీను, పట్టణ పార్టీ అధ్యక్షుడు వంటెద్దు బాబి, చీకట్ల అబ్బాయి, గెద్దం సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సభ ప్రారంభంలోనే రసాభాస

ప్రమాణస్వీకార సభ ప్రారంభంలోనే రసాభాసగా మారింది. పార్టీ నాయకులను సభాధ్యక్షుడు కామన ప్రభాకరావు వేదికపైకి ఆహ్వానిస్తున్న సమయంలో తనను కావాలనే వేదికపైకి ఆహ్వానించలేదంటూ పీసీసీ ఉపాధ్యక్షుడు కొత్తూరి శ్రీను ధ్వజమెత్తారు. దీంతో రుద్రరాజు తదితర పార్టీ సీనియర్ నాయకులు కొత్తూరి శ్రీనును సముదాయించి వివాదాన్ని సద్దుమణిగించారు.



సమావేశంలో వేదిక వద్ద ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పీసీసీ ఉపాధ్యక్షుడు కొత్తూరి శ్రీను

శిక్షణ కంటే సాధన గొప్పది



గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందరావు

ఉప్పలగుప్తం: శిక్షణ కంటే సాధన గొప్పదని, విద్యార్థులు ఆటల్లో నిరంతరం సాధన చేస్తూ జాతీయ స్థాయికి చేరుకోవాలని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. మంగళవారం మండలంలోని గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన నియోజవర్గస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఎంపికల ప్రారంభోత్సవ సభకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ మండలంలోని ఎస్.యానాం సముద్ర తీరంలో జాతీయ మహిళా బీచ్ వాలీబాల్ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనందరావుపై ఎన్నికల ముందేగాని ఎన్నికల తరువాత బీసీలకు గుర్తింపు లేదా అంటూ అమలాపురం నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు గుత్తుల నాగేశ్వరరావు, స్థానిక బీసీ నాయకుడు చప్పిడి కిరణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వారికి సర్ది చెప్పడంతో వివాదం సద్దుమణిగింది. కార్యక్రమంలో ఎమ్మెల్సీ యిళ్ల వెంకటేశ్వరావు, ఎంఈవో ఎస్.సత్యకృష్ణ, హెచ్ఎం ఎల్.రాణి, జెడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపదరావు, సర్పంచ్‌లు జొన్నాడ శ్రీదుర్గ, కడిమి చిన్న వరాజు తదితరులు పాల్గొన్నారు.

దౌర్జన్యాలకు పాల్పడిన ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయాలి

ఉప్పలగుప్తం: ఇటీవల ఉండి నియోజకవర్గంలో అంబేడ్కర్ ఫ్లెక్సీను దౌర్జన్యంగా చించేసిన టీడీపీ ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు, రంగరాయ వైద్య కళాశాలలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఉమామహేశ్వరరావుపై అసభ్యకరమైన పదజాలంతో తిడుతూ చేయిచేసుకున్న కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీలను ఎమ్మెల్యే పదవి నుంచి సస్పెండ్ చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపదరావు అన్నారు. మండలంలోని స్థానిక గ్రామంలో ఉన్న అంబేడ్కర్ కమ్యూనిటీ భవనంలో సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు అధ్యక్షతన దళిత నాయకులు మంగళవారం విలేకర్లతో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి పినిపే జయరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఆంధ్రప్రదేశ్‌లో భారత రాజ్యాంగానికి విలువ లేకుండా పోయి రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తుందన్నారు. ఎమ్మెల్యేలు రఘురామకృష్ణంరాజు, పంతం నానాజీలపై చట్టపరమైన చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. వారిద్దరిపై అట్రాసిటీ కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకుడు కుంచే రమణారావు, వైస్ ఎంపీపీ సాదే శ్రీనువాసరావు, సర్పంచ్ యర్రంశెట్టి రామచంద్రరావు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం మండల అధ్యక్షుడు ఓగూరి విజయ్‌కుమార్, మాలమహానాడు మండలాధ్యక్షుడు కొంకి వెంకట బాబ్జి, జేసీఎస్ కన్వీనర్ కోటుం లోవరాజు, చేట్ల విద్యాసాగర్, ఊటాల రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



ఉప్పలగుప్తంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న దళిత నాయకులు

ఉత్తమ టీచర్ దుర్గాభవానికి సత్కారం



ఉత్తమ టీచర్ దుర్గాభవాని దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయ బృందం

యానాం: విద్యారంగంలో విశేష సేవలందిస్తూ విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దుతున్న ఉత్తమ టీచర్ అవార్డు గ్రహీత దడాల దుర్గాభవానిని పలువురు అభినందించారు. యానాంలో శారదా ప్రభుత్వ ఎయిడెడ్ స్కూల్‌లో పనిచేస్తున్న దుర్గాభవానిని స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు మంగళవారం ఘనంగా సత్కరించారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు చిక్కాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దుర్గాభవాని 28 ఏళ్లుగా ఉపాధ్యాయురాలిగా విద్యార్థులను అత్యున్నత శిఖరాలకు ఎదిగేలా తీర్చిదిద్దేందుకు అందించిన సేవలు ఎనలేనివని కొనియాడారు. అనంతరం దుర్గాభవాని, వడ్డి ఏడుకొండలు దంపతులను పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో కాపగంటి ఉమాశంకర్, కంచర్ల శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కల్తీ నెయ్యి బాధ్యులను కఠినంగా శిక్షించాలి

ముమ్మిడివరం: తిరుమల మహాప్రసాదం లడ్డూలో కల్తీ నెయ్యి వాడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని భారతి పురోహిత సంక్షేమ సమాఖ్య ప్రతినిధులు అన్నారు. మంగళవారం భారతి పురోహిత సంక్షేమ సమాఖ్య అధ్యక్షుడు ఆకొండి రామకృష్ణ, నాగాభట్ల రవిశర్మ, ఆకొండి మహేష్, కొంపెల్ల చైన్‌లు, కొడమర్తి శర్మ, దుర్గ, వీరాస్వామినాయుడు, కరణం కృష్ణ తదితరులు స్థానిక తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. తిరుమల లడ్డూ ప్రసాదంలో జంతువుల అవశేషాలు కలిగిన కల్తీ నెయ్యి వాడినట్లు సీఎంతో పాటు అధికారులు బహిరంగ ప్రకటన చేశారని, దీనివల్ల హిందువుల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు.

మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన ‘కలశం’ ప్రతినిధులు

అమలాపురం టౌన్: అమలాపురం మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన కేవీఆర్‌ఆర్ రాజును కోనసీమ లైసెన్స్‌డ్ సర్వేయర్స్ ఆర్కిటెక్ట్స్ ఇంజినీర్ల మెంబర్ల(కలశం) సంఘం ప్రతినిధులు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కమిషనర్ రాజును కలశం జిల్లా అధ్యక్షుడు యేడిద దొరబాబు, కోశాధికారి మలిశెట్టి నాగేశ్వరావు, అమలాపురం శాఖ అధ్యక్షుడు ఐ.బాలకృష్ణ ఘనంగా సత్కరించారు. ఇటీవల ఎన్నికైన కలశం జిల్లా నూతన కార్యవర్గాన్ని కమిషనర్ రాజు అభినందించారు. కార్యక్రమంలో వి.కన్నబాబు, బి.గోపాలకృష్ణ, బి.కృష్ణ మోహన్, సీహెచ్ బాబ్జీ, ఆర్.శివ తదితరులు పాల్గొన్నారు.

చేత వృత్తుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..

కొత్తగా బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ కమిషనర్ రాజును జిల్లా కార్పెంటర్ చేతివృత్తుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో సంఘ ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలసి సత్కరించారు.

విశ్వ కర్మ యోజన పథకం ఆన్‌లైన్ విధి విధానాల గురించి కమిషనర్ రాజు చేతి వృత్తుల సంక్షేమ సంఘ ప్రతినిధులతో కొద్దిసేపు చర్చించారు.



మున్సిపల్ కమిషనర్ రాజును సత్కరిస్తున్న జిల్లా ‘కలశం’ ప్రతినిధులు

సీఎంని జేబులో పెట్టుకుని పేకాట క్లబ్ మూయించలేరా?

- అసెంబ్లీలో జూద నిషేధ చట్టాన్ని తీసుకురావాలి
- ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్

యానాం: పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి పదవి హోదాలో ఉన్న మల్లాడి కృష్ణారావు సీఎంని జేబులో పెట్టుకుని యానాంలో ఒక పేకట క్లబ్‌ను మూయించలేరా అని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ప్రశ్నించారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పుదుచ్చేరి సీఎం రంగసామి ప్రధాన అనుచరుడిగా ఆయన వద్దే ఉండే మల్లాడి అకారణంగా తనపై ఆరోపణలు చేయడం భావ్యం కాదన్నారు. పేకాట క్లబ్‌ను మూసేయాలంటూ తాను మున్సిపల్ కమిషనర్‌కు తక్షణం తెలిపానని, అయితే నిర్వాహకులు కోర్టు నుంచి పది రోజులకు అనుమతి తెచ్చుకున్నారని కమిషనర్ బదులిచ్చారన్నారు. క్లబ్ మూసేశాక ధర్నా చేయడంలో మల్లాడి అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. తక్షణం పేకాట క్లబ్‌లను నిరోధించేలా అసెంబ్లీలో చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. తాను సీఎస్ఆర్, ఎమ్మెల్యే ల్యాడ్, ఎంపీ ల్యాడ్ నిధులు తెస్తుంటే పనులు జరగకుండా అభివృద్ధి నిరోధకుడిగా మల్లాడి మారారని ఆరోపించారు. రీజెన్సీ ఫ్యాక్టరీ ప్రారంభించాలంటే యాజమాన్యం తన కాళ్ల వద్దకు రావాలన్న ధోరణిలో సీఎం రంగసామికి చెప్పి అడ్డుకుంటున్నారన్నారు. తాను ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేర్చే ఎన్నికల్లో ప్రజల్లోకి వెళతానన్నారు.



ఎమ్మెల్యే అశోక్

వైద్యుల సమ్మెతో సేవలకు అంతరాయం

ఆలమూరు: జీఓ నెం 85ను రద్దు చేయాలని కోరుతూ గత వారం రోజులు పీహెచ్‌సీ వైద్యులు చేస్తున్న సమ్మెతో రోగుల సేవలకు తీవ్ర విఘాతం ఏర్పడింది. దీంతో అసలే వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఆస్పత్రుల్లో వైద్యులు లేక రోగులు ప్రైవేట్ ఆస్పత్రులను, ఆర్ఎంపీ, పీఎంపీలను ఆశ్రయించి రూ వేలల్లో ఖర్చు చేయాల్సిన పరిస్థితి. అలాగే గత ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఎఫ్‌డీపీ (ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం) ఈ వైద్యుల సమ్మెతో నిరుపయోగంగా మారింది. ఇకనైనా ప్రభుత్వం సత్వరమే స్పందించి వైద్యులతో సమ్మె విరమింపజేయాలని ప్రజలు కోరుతున్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలి



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు



భట్నవిల్లిలో పొలంబడి కార్యక్రమం నిర్వహిస్తున్న వ్యవసాయ అధికారులు



మూలపాలంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయాధికారులు

అల్లవరం: రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు అన్నారు. మండలంలోని గూడాల గ్రామంలో సర్పంచ్ దాకారపు చిరంజీవిరావు అధ్యక్షతన రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు మాట్లాడుతూ రైతులంతా వరి సస్యరక్షణకు డ్రోన్లు ఉపయోగిస్తే సమయం, డబ్బు ఆదా అవుతాయన్నారు. రైతులందరూ ప్రకృతి వ్యవసాయం దిశగా అడుగులు వేయాలని సూచించారు. వ్యవసాయ అనుబంధ శాఖల పథకాలపై అవగాహన కల్పించడం, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించే దిశగా రైతులకు సలహాలు, సూచనలు అందించడం పొలం పిలుస్తోంది కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. జిల్లా వ్యాప్తంగా 1,57,900 ఎకరాల్లో వరి సాగు చేయగా 1,56,446 ఎకరాల్లో ఈ–పంట నమోదు కార్యక్రమం పూర్తయిందన్నారు. 1,32,900 ఎకరాలకు చెందిన రైతులకు ఈకేవైసీ నమోదు చేశామన్నారు. మిగిలిన రైతులకు ఈకేవైసీ నమోదు క్షేత్రస్థాయిలో జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి నారాయణరావు మాట్లాడుతూ పశువులను ఉంచేందుకు మినీ గోకులం షెడ్ల నిర్మాణానికి రుణాలు మంజూరు చేస్తున్నామన్నారు. ఆసక్తి ఉన్న రైతులు తమను సంప్రదించాలన్నారు. ఎఫ్‌డీఓ అశ్విని, ఏఈఓ శివమోహన్, కార్యదర్శి రెడ్డి శిరీష, రైతులు పాల్గొన్నారు.

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకే పొలంబడి

అమలాపురం రూరల్: వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకే పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఏవో కె.ధర్మప్రసాద్ అన్నారు. మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో భట్నవిల్లి, రెడ్డిపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు భట్నవిల్లి సర్పంచ్ తిరుకోటి సుజాత అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో ధర్మప్రసాద్ మాట్లాడుతూ రైతులకు వ్యవసాయంలో ఎప్పటికప్పుడు నూతన సాంకేతిక పద్ధతులను తెలియజేయడం ద్వారా నాణ్యమైన దిగుబడులు పొందేలా కృషి చేస్తున్నామని చెప్పారు. పంట దిగుబడులు తగ్గడానికి కారణాలు తెలుసుకుని, సూక్ష్మ పోషక లోపాలు గుర్తించి తద్వారా భూసారాన్ని పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పశువైద్యాధికారి వి.పూర్ణిమ పశు పోషణ గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో మత్స్య శాఖ సహాయకులు యు.వెంకటేశ్వరరావు, వ్యవసాయ విస్తరణాధికారి డి.ప్రేమ్‌కుమార్, వ్యవసాయ ఉద్యాన సహాయకులు పి.నవ్య, ఎన్.వెంకటలక్ష్మి, ఎన్.రోజా, రైతులు కరాటం ప్రవీణ్, కరాటం సూర్యభాస్కరరావు, కొలిశెట్టి జయప్రకాష్, రేలంగి నారాయణరావు, సుబ్రహ్మణ్యశర్మ, సారపల్లి సుబ్బారావు పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయంపై అవగాహన కోసమే..

తాళ్లరేవు: రైతులకు ఆధునిక వ్యవసాయ, సాంకేతిక సమాచార పరిజ్ఞానాన్ని చేరవేయడం, వ్యవసాయ అనుబంధ శాఖల పథకాలపై అవగాహన కల్పించడమే ముఖ్య ఉద్దేశంగా పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి ఎస్.విజయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం పి.మల్లవరం పంచాయతీ మూలపాలెం గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. అనంతరం రైతులతో సమావేశం నిర్వహించారు. నీటి ఎద్దడి తక్కువగా ఉన్న ప్రాంతంలో పంటల ప్రణాళిక, విత్తనాల ఎంపిక, భూసార పరీక్షలు తదితర వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కరప సబ్‌డివిజన్ ఏడీఏ కె.బాబూరావు, మండల వ్యవసాయ శాఖాధికారి ఎస్.ప్రశాంతి, జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, ఉంగరాల వెంకటేశ్వరరావు, ధూళిపూడి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అనాతవరంలో పొలం పిలుస్తోంది

ముమ్మిడివరం: మండల పరిధిలోని అనాతవరంలో సర్పంచ్ మిమ్మితి చిరంజీవి సుబ్రహ్మణ్యశాస్త్రి అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు.

జిల్లా స్థాయి గేమ్స్‌లో ప్రతిభ చూపాలి

రావులపాలెం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నియోజకవర్గ స్థాయిలో గెలుపొందిన విద్యార్థులు జిల్లా స్థాయిలో కూడా రాణించి మంచి పేరు తీసుకురావాలని హెచ్ఎం కేఎస్‌వీ కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని ఈతకోట హైస్కూల్లో మంగళవారం ఎస్‌జీఎఫ్ గేమ్స్‌లో భాగంగా కొత్తపేట నియోజకవర్గస్థాయిలో కబడ్డీ, వాలీబాల్, కోకో, షటిల్ బ్యాడ్మింటన్, చెస్, యోగా పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో అండర్–14 అండర్–17 విభాగాల్లో 102 మంది క్రీడాకారులు జిల్లా స్థాయికి ఎంపికైనట్లు స్కూల్ అసిస్టెంట్ పీఈ టి.రామకృష్ణ తెలిపారు. ప్రతి క్రీడాంశంలో ఒక విభాగం నుంచి ఐదుగురు చొప్పున జిల్లా ఎంపిక చేశామన్నారు. గెలుపొందిన విద్యార్థులను స్కూలు చైర్మన్ పి.రమేష్, ఉపాధ్యాయులు అభినందించారు.



ఎస్‌జీఎఫ్ గేమ్స్‌లో చెస్‌లో జిల్లాకు ఎంపికైన క్రీడాకారులతో ఉపాధ్యాయులు